ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 132 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం17 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## గన్నవరం విమానాశ్రయంలో
### రాష్ట్రపతికి ఘన స్వాగతం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు.

**విజయవాడ, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆమెకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో పోలీసు గౌరవవందనం స్వీకరించిన అనంతరం రోడ్డు మార్గంలో మంగళగిరి ఎయిమ్స్కు రాష్ట్రపతి బయలుదేరి వెళ్లారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విద్యా సంస్థ(ఎయిమ్స్) స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.








## లోక్ సభ ముందుకు
### 'జమిలి ఎన్నికల' బిల్లు

జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్ సభలో ప్రవేశపెట్టింది.

**ఢిల్లీ, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** లోక్ సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకొచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లు ను కేంద్రం మంగళవారం (డిసెంబరు 17న) లోక్ సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్రామ్ మేఘ్వాల్ దిగువ సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టారు.



## సీఎం నివాసం సమీపంలో బాంబు కలకలం..

### మణిపుర్ సీఎం నివాసం సమీపంలో ఓ లైవ్ బాంబు కన్పించడం కలకలం సృష్టించింది.



**ఇంఫాల్, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** మైతేయ్-కుకీ తెగల మధ్య చెలరేగిన ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపుర్ ఏడాదిన్నరగా అతలాకుతలమవుతూనే ఉంది. పలుచోట్ల హింసాత్మక ఘటనలు, బాంబు దాడులు, ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఈనేపథ్యంలో తాజాగా ముఖ్యమంత్రి నివాసం వద్దే బాంబు కన్పించడం తీవ్ర కలకలం సృష్టించింది.మణిపుర్లోని కొయిరెంగేయ్ ప్రాంతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కు ప్రైవేటు నివాసం ఉంది. ఈ ఇంటికి కొన్ని మీటర్ల దూరంలో మంగళవారం తెల్లవారుజామున ఓ మోర్టార్ బాంబును గుర్తించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాంబును నిర్వీర్యం చేశారు. అయితే, ఘటన సమయంలో సీఎం నివాసంలో లేరని సమాచారం.ఈ రాకెట్ ప్రొపెల్డ్ బాంబును గత రాత్రి ప్రయోగించి ఉంటారని కొంతమంది స్థానికులు చెబుతున్నారు. అది పేలకుండా ఇక్కడ పడిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఘటన నేపథ్యంలో సీఎం ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాంబు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరు ప్రయోగించి ఉంటారు? అన్న కోణంలోను దర్యాప్తు చేస్తున్నారు.

## తెదేపా కార్యకర్తలకు సారీ.. మళ్లీ ఇలా జరగకుండా జాగ్రత్త పడతా
### :మంత్రి పార్థసారథి

తెదేపా కార్యకర్తలకు మంత్రి కొలుసు పార్థసారథి మరోసారి క్షమాపణలు చెప్పారు.



**అమరావతి, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** తెదేపా కార్యకర్తలకు మంత్రి కొలుసు పార్థసారథి మరోసారి క్షమాపణలు చెప్పారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆదివారం జరిగిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్తో కలిసి పాల్గొనడంపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో పార్థసారథి ఇప్పటికే సీఎం చంద్రబాబుకు క్షమాపణలు చెప్పారు. తాజాగా మీడియా సమావేశం నిర్వహించి కార్యకర్తలకు సారీ చెప్పారు.ఇదీ చదవండి: సీనియర్ నేతలే.. ఇంగితం లేదా?"చంద్రబాబు, లోకేశ్ నాకిచ్చిన గౌరవాన్ని ఎప్పుడూ మర్చిపోను. తెదేపా సిద్ధాంతాలను దెబ్బతీసే వ్యక్తిని మాత్రం కాదు. మళ్లీ ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడతా. తెదేపా కార్యక్రమాల్లో చొరబడటం వైకాపా నేతలకు అలవాటే వ్యక్తిగతంగా జోగి రమేష్తో నాకెలాంటి సంబంధం లేదు" అని మంత్రి పార్థసారథి తెలిపారు.తెదేపా ప్రతిపక్షంలో ఉండగా సాక్షాత్తు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇంటిపైకి దండెత్తి వచ్చిన జోగి రమేష్తో.... సీనియర్ మంత్రి కొలుసు పార్థసారథి, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన అత్యంత సీనియర్ నాయకుడు, ప్రస్తుత ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వేదిక పంచుకోవడంపై తెదేపా శ్రేణులు మండిపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ సారీ చెప్పారు.

## చైనాలో భారీ అవినీతి కుంభకోణం ..అధికారికి మరణశిక్ష

చైనాలో జరిగిన అవినీతి కుంభకోణంలో ఓ అధికారి ప్రమేయం ఉందని తేలడంతో ఆయనకు మరణశిక్ష విధిస్తూ ఓన్యాయస్థానం తీర్పు వెలువరించింది.



**డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** అవినీతికి పాల్పడే అధికారులపై చైనా ఉక్కుపాదం మోపుతోంది. ఈక్రమంలోనే దేశంలో జరిగిన అతిపెద్ద కుంభకోణంతో ప్రమేయం ఉన్న ఓ అధికారికి మరణశిక్ష విధించింది. దీనిపై అక్కడి మీడియాలో కథనాలు వెల్లడిస్తున్నాయి.ఉత్తర అంతర్గత మంగోలియా స్వతంత్ర ప్రాంత అధికారిగా లీ జియాన్పింగ్ విధులు నిర్వహించేవారు. ఇతని హయాంలో దేశంలో 421 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,500 కోట్లు) అవినీతి బయటపడింది. ఈ కుంభకోణంలో లీ ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో 2022లో ఓ న్యాయస్థానం ఆయనకు మరణశిక్ష విధించింది. అయితే, దీనిపై ఆయన సుప్రీం పీపుల్స్ కోర్టును ఆశ్రయించారు. అక్కడ లీ మరణశిక్షకు ఆమోదం లభించడంతో మంగళవారం ఉరిశిక్ష విధించారు.

## పేర్ని నానీ.. పేదల బియ్యం బొక్కేసి నీతికబుర్లా?
### : మంత్రి కొల్లు రవీంద్ర

వైకాపా నేత పేర్ని నాని పేదల బియ్యం బొక్కేసి నీతి కబుర్లు చెబుతున్నాడని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.




గిడ్డంగిలోని 185 టన్నుల రేషన్ బియ్యం మాయమవడంపై క్రిమినల్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు చర్యలు చేపట్టారు. గిడ్డంగిలోని రేషన్ బియ్యాన్ని అధికారులు 8 లారీల ద్వారా మచిలీపట్నం మార్కెట్యార్డుకు తరలించారు. స్టాక్ మొత్తం ఖాళీ చేసిన తర్వాత గిడ్డంగిని బ్లాక్లో పెట్టే అవకాశం ఉంది.

**అమరావతి,డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత పేర్ని నాని పేదల బియ్యం బొక్కేసి నీతి కబుర్లు చెబుతున్నాడని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. పేర్ని నానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రూ.90లక్షల విలువైన 187 టన్నుల బియ్యాన్ని తినేశారని దుయ్యబట్టారు. పేర్ని కుటుంబం అంతా పరారీలోనే ఉందన్న మంత్రి కొల్లు రవీంద్ర.. దొంగ అయిన పేర్ని నానికి పరామర్శలు విడ్డూరమని మండిపడ్డారు. వైకాపా అంతా దొంగల పార్టీనే అని అర్థ-మవుతోందని ఆక్షేపించారు.వైకాపా నేత పేర్ని నాని కుటుంబానికి చెందిన

## శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు
### ..మార్చి 2025 కోటా విడుదల రేపు

శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తితిదే మార్చి 2025కు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అష్టదళపాద పద్మారాధన సేవల ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఈ నెల 18వ తేదీ ఉదయం పది గంటలకు ఆన్లైన్లో విడుదల చేయనుంది.



**తిరుమల, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తితిదే మార్చి 2025కు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అష్టదళపాద పద్మారాధన సేవల ఆర్జిత సేవా టికెట్ల కోటాను ఈ నెల 18వ తేదీ ఉదయం పది గంటలకు ఆన్లైన్లో విడుదల చేయనుంది. వీటిలోనే లక్కీడిప్ కోటా కోసం 20వ తేదీ ఉదయం పది గంటల వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చు. లిఈనెల 21వ తేదీ ఉదయం పది గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్సేవ, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఆన్లైన్లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు అందుబాటులో ఉంచుతారు.ఈనెల 23వ తేదీ ఉదయం పది గంటలకు అంగ ప్రదక్షిణం కోటా, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా, మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా విడుదల ఉంటుంది. లి ఈనెల 24వ తేదీ ఉదయం పది గంటలకు మార్చి 2025 ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ ఉంటుంది.లి ఈనెల 27న మార్చి నెల శ్రీవారి సేవ కోటా విడుదల చేస్తారు. భక్తులు గమనించిలో ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

## ఆ వీడియోలు నమ్మొద్దు
### ..కస్టమర్లకు ఎస్బీఐ అలర్ట్

ఎస్బీఐ టాప్ మేనేజ్మెంట్ కు చెందిన ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసింది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.




**డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** పెద్దఎత్తున రిటర్నులు.. అంటూ స్టేట్ బ్యాంక్ టాప్ మేనేజ్మెంట్ చెబుతున్నట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్బీఐ స్పందించింది. ఇవన్నీ కేవలం నకిలీ వీడియోలు అంటూ స్పష్టంచేసింది. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఓ పోస్ట్ విడుదల చేసింది.ఇదీ చదవండి: అంబానీ, అదానీకి 6 నెలల్లో ఏమైంది?"బ్యాంక్ మేనేజ్మెంట్కు చెందిన వ్యక్తులంటూ సోషల్మీడియాలో చక్కర్లు కొడుతున్న డీప్ ఫేక్ వీడియోలు నమ్మొద్దు. ఆ వీడియోలో పేర్కొన్న పథకాలతో బ్యాంక్కు గానీ, బ్యాంక్ అధికారులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. ఈ వీడియోలో ఫలానా పథకంలో పెట్టుబడి పెట్టండంటూ ప్రజలకు సలహా ఇస్తున్నారు. ఇలాంటి అవాస్తవమైన, అసాధారణ రాబడి ఇచ్చే వాగ్దానాలు ఎస్బీఐ చేయదు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి" అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.

## యువ వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలందించాలి : రాష్ట్రపతి ముర్ము

యువ వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు.



**మంగళగిరి, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** యువ వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలందించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న ముర్ముకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు స్వాగతం పలికారు. అనంతరం ఎయిమ్స్కు చేరుకున్న రాష్ట్రపతి.. మొదటి బ్యాచ్గా వైద్య విద్య పూర్తి చేసుకున్న 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు."వైద్య వృత్తిని ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు మానవత్వంతో సేవ చేసే దారిని ఎంచుకున్నారు. ప్రజల ప్రాణాలు కాపాడి.. వారి ఆరోగ్యం మెరుగుపరిచే అమూల్యమైన అవకాశం మీకు వస్తుంది. మీలాంటి యువ వైద్యులు.. గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంత ప్రజలకు సేవ చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. జాతి సమ్మిళిత ఆరోగ్య సంరక్షణలో ప్రత్యేకించి మీలాంటి యువ వైద్యులు కీలక పాత్ర పోషించాలి. ఈ దశలో మీరు చిత్తశుద్ధితో పనిచేసి.. దేశ ఆరోగ్యాభివృద్ధిలో పాలుపంచుకుంటారని ఆశిస్తున్నా" అని రాష్ట్రపతి అన్నారు.ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: చంద్రబాబు మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అత్యాధునిక సేలందిస్తున్న మంగళగిరి ఎయిమ్స్ దేశంలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. మంగళగిరి ఎయిమ్స్ కోసం మరో 10 ఎకరాల స్థలం కేటాయిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు లోకేశ్, సత్యకుమార్ పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## టిసి ఎలక్షన్స్ లో డీసీ ఫోర్ చైర్మన్‌గా సంజీవ్ కుమార్ రెడ్డి ఏకగ్రీవం



**నంద్యాల, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** సిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన చిన్నారెడ్డి సంజీవ్ కుమార్ రెడ్డి ఈనెల 14వ తారీకు జరిగిన టిసి ఎలక్షన్స్ లో డీసీ ఫోర్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయనకు సహకరించిన శ్రేయోభిలాషులకు, ఆత్మీయులకు మరీ ముఖ్యంగా ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియకి, భార్గవ నాయుడుకి అందరికీ హృదయపూర్వకంగా తన ధన్యవాదాలు తెలిపారు.

## హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు

కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు.



**హైదరాబాద్, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమన్నారు."గతంలో పర్మిషన్ తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల వైపు వెళ్లం. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటి కూల్చివేతలు తప్పదు. కొత్తగా తీసుకున్న అనుమతులను హైడ్రా పరిశీలిస్తుంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు పనిచేస్తున్నాం. పేదల జోలికి హైడ్రా రాదు. వారి ఇళ్లను కూల్చివేస్తున్నామనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు" అని రంగనాథ్ కోరారు.

## కలుషిత ఆహారం తిని 13 మంది విద్యార్థులకు అస్వస్థత

కలుషిత ఆహారం తిని 13మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన పెనుకొండలో చోటుచేసుకుంది..

**పెనుకొండ, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** కలుషిత ఆహారం తిని 13మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన పెనుకొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని రాంపురం ఎంజెపీ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి భోజనం తిన్న తర్వాత 13 మంది 6వ తరగతి విద్యార్థినులు వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. విద్యార్థులకు తీవ్ర అస్వస్థత కావడంతో వెంటనే పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో మొత్తం 256 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఉదయానికి 12 మంది విద్యార్థులకు ఆరోగ్యం కుదుట పడడంతో వారిని పంపించారు. ఒక విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండడంతో పెనుకొండ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం రాత్రి జరిగడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## లగచర్ల ఘటనపై చర్చకు విపక్షాల పట్టు ..నిరసనల మధ్య 3 బిల్లులకు ఆమోదం


భారాస, భాజపా సభ్యుల నిరసనల మధ్య తెలంగాణ శాసనసభ మూడు బిల్లులకు ఆమోదం తెలపింది.



**హైదరాబాద్, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ శాసనసభ సమావేశాలు విపక్షాల నిరసనల మధ్య కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనపై అసెంబ్లీలో చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. వాయిదా తీర్మానాల కోసం భారాస, భాజపా డిమాండ్ చేశాయి. భారాస, భాజపా సభ్యుల నిరసనల మధ్యే శాసనసభ మూడు కీలక బిల్లులను ఆమోదించింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులకు ఆమోదం లభించింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలపడం గమనార్హం. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది.

## పర్యాటక రంగంలో పెట్టుబడుల కోసం చర్యలు..

పర్యాటక రంగంలో పెట్టుబడులను రప్పించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.




**విజయవాడ, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** పర్యాటక రంగంలో పెట్టుబడులను రప్పించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ రంగంలో ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహించింది. విజయవాడలోని ఓ హెూటల్లో జరిగిన ఈ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, చైర్మన్ నూకసాని బాలాజీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు. ప్రభుత్వ పరంగా ఇచ్చే ప్రోత్సాహకాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం పాలసీ 2024 పై ఈ భేటీలో చర్చ జరిగింది.

## హరీశ్ రావు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు : డిప్యూటీ సీఎం భట్టి

శాసనసభను భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు తప్పుదోవ పట్టిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కవిమర్శించారు.



**హైదరాబాద్, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** శాసనసభను భారాస ఎమ్మెల్యే హరీశ్రావు తప్పుదోవ పట్టిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. స్పీకర్ అనుమతితో అప్పులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్ ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్రావు, భట్టి విక్రమార్క మధ్య వాదన కొనసాగింది.ఏడాదిలోనే రూ.1.27లక్షల కోట్ల అప్పు: హరీశ్ రావు తొలుత భారాస సభ్యుడు హరీశ్రావు మాట్లాడుతూ ఆర్బీఐ వివరాల ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ.1.27 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఐదేళ్ల పాలన పూర్తయ్యే సరికి ఈ ప్రభుత్వం చేసిన అప్పు రూ.6.36 లక్షల కోట్లకు చేరుతుందన్నారు. భారాస హయాంలో చేసిన అప్పులపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.4,17,496 కోట్ల అప్పు చేస్తే.. రూ. 7 లక్షల కోట్ల పైచిలుకు అంటూ గోబెల్స్ ప్రచారం చేశారన్నారు. దీనిపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్లు తెలిపారు. అప్పుల అంశంపై సభలో ప్రత్యేక చర్చ చేపట్టాలని హరీశ్రావు డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చడం తమకు సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని.. ఇప్పుడు అప్పుల పేరు చెప్పి తప్పించుకుంటున్నారని విమర్శించారు.చర్చకు మేం సిద్ధమే: భట్టిఅనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రజలకు వాస్తవాలు తెలియాలనే సభలో శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ఎస్ఆర్బీఎం పరిమితి దాటి అప్పులు చేయడం లేదని చెప్పారు. స్పీకర్ అనుమతితో ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో హరీశ్రవుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "సత్యదూరమైన మాటలతో ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయొద్దు. సభను తప్పుదోవ పట్టించొద్దు. గత ప్రభుత్వ లోపాలను ప్రజలకు తెలియజెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. భారాస హయాంలో దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారా? తీసుకునే అప్పుల విషయంలో మేం దాచుకోకుండా చెప్పాం. మీరు మాత్రం అప్పట్లో దాచిపెట్టారు" అని విమర్శించారు.మాకే నీతులెందుకు చెబుతున్నారంటూ స్పీకర్ను ఉద్దేశించి హరీశ్రావు చేసిన వ్యాఖ్యలపై భట్టి అభ్యంతరం తెలిపారు. సభాపతిని శాసించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. "బీఏసీ సమావేశంలో హరీశ్రవు లేచి కాగితాలు పడేసి బయటకు వెళ్లారు. భారాస హయాంలో పోచారం శ్రీనివాస్రెడ్డి స్పీకర్గా ఉన్నప్పుడు ఏ నిబంధనలు పాటించారో ఇప్పుడూ అవే పాటించాలి కదా! సభ ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై సభాపతి నిర్ణయం తీసుకుంటారని భారాస హయాంలో మాకు చెప్పారు. ఇప్పుడు ఎందుకు దాన్ని పాటించరు? సభాపతి స్థానాన్ని అందరూ గౌరవించాలి.. నియమాల ప్రకారం నడుచుకోవాలి" అని భట్టి అన్నారు.అనంతరం హరీశ్రావు స్పందిస్తూ రూల్స్ బుక్ ఆధారంగానే తాను మాట్లాడినట్లు చెప్పారు. సభను తప్పుదోవ పట్టించేందుకే భట్టి విమర్శలు చేశారన్నారు. అప్పులపై ఈ సమావేశాల్లోనే చర్చకు అనుమతించాలని స్పీకర్ను కోరారు.

## రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలు

రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు వినతులు అందజేశారు.



**గాజువాక , డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలు పరిస్కరించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు వినతులు అందజేశారు. ఎప్పట్నుంచో పెండింగ్లో ఉన్న కొండ ప్రాంత ఇళ్ల పట్టాలు అందజేయాలని.. 22ఏ ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఆర్ అమల, స్పెషల్ ఆఫీసర్ సైలజ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఎంబీబీఎస్ ,బీడీఎస్ విద్యార్థులకు ఊరట

తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట లభించింది.




**హైదరాబాద్,డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట లభించింది. ఇతర రాష్ట్రాల్లో చదివిన రాష్ట్ర విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు జీవో 140 సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

## యోగి ఆదిత్యనాథ్‌నే కలిసిన తెదేపా నాయకులు

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నే కలిసిన తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.



**విజయనగరం, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్నే కలిసిన తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. అయోధ్య, వారణాసి పుణ్యక్షేత్రాలలో తెలుగువారికి ఉపయోగపడే తెలుగు సమాచార కేంద్రాల ఏర్పాటు, భక్తుల వసతి, భోజన సౌకర్యాల భవనం కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలని, కోరుతూ లఖ్నవూలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అయోధ్య వారణాసి నగరాలకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందనీ ఈ భక్తుల కోసం రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆలయ ప్రాంతాల్లో తెలుగులో సమాచారం అందించే సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ అప్పలనాయుడు కోరారు. ఇలాంటి కేంద్రాలు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, మరియు భక్తుల కోసం భాషా సమస్యలను పరిష్కరించడానికి ఎంతో ఉపయోగపడతాయనీ వివరించారు.

## కాకినాడ పోర్టులో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం గుర్తించాం: కలెక్టర్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును పరిశీలించిన తర్వాత అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది.





**కాకినాడ, డిసెంబర్ 17, (రిపబ్లిక్ న్యూస్):** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును పరిశీలించిన తర్వాత అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. స్టెల్లా నౌక ద్వారా పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలిస్తున్నారన్న సమాచారంతో గత నెల 29న పవన్ కల్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులతో కలిసి నౌకను పరిశీలించారు. ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు.కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. "నవంబరు 29న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్టెల్లా షిప్పు పరిశీలించిన తర్వాత ఐదు విభాగాల అధికారులు బృందంగా ఏర్పడి 12గంటల పాటు స్టెల్లా షిప్ లోని 5 కంపార్ట్మెంట్లలో తనిఖీలు నిర్వహించి 12శాంపిల్స్ సేకరించారు. షిప్లో దాదాపు 4వేల టన్నుల బియ్యం ఉన్నాయి. వాటిలో 1,320 టన్నుల పీడీఎస్ బియ్యం ఉన్నట్టు నిర్ధరించాం. ఈ షిప్ ద్వారా సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ బియ్యం ఎగుమతి చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. వాళ్లు ఎక్కడి నుంచి బియ్యం తీసుకొచ్చారు, ఎక్కడ నిల్వ చేశారనేదానిపై దర్యాప్తు జరుగుతోంది. 1,320 టన్నుల బియ్యాన్ని వెంటనే షిప్ నుంచి అన్లోడ్ చేయించి సీజ్ చేస్తాం. కాకినాడ పోర్టులో ఇంకా లోడ్ చేయాల్సిన బియ్యం 12 వేల టన్నులు ఉన్నాయి. వాటిలో ఎక్కడా పీడీఎస్ బియ్యం లేవని నిర్ధరించుకున్న తర్వాతే లోడింగ్కు అనుమతిస్తాం. కాకినాడ యాంకేజ్ పోర్టు, డీప్ వాటర్ పోర్టులో కూడా మరో చెకోపోస్టు ఏర్పాటు చేశాం. ఒక్క గ్రాము పీడీఎస్ బియ్యం కూడా దేశం దాటకుండా చర్యలు తీసుకుంటాం. షిప్పు ఎప్పుడు రిలీజ్ చేయాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. నిజాయతీగా బియ్యం వ్యాపారం చేసేవారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వ్యాపారులు, కూలీలు భయపడాల్సిన అవసరం లేదు" అని కాకినాడ కలెక్టర్ స్పష్టం చేశారు.


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1273:** పర్షియన్ కవి, ఇస్లామీయ న్యాయతత్వవాది, ధార్మికవేత్త, సూఫీ జలాలుద్దీన్ ముహమ్మద్ రూమి మరణం. (జ.1207)
- **1778:** బ్రిటన్ కు చెందిన రసాయన శాస్త్రవేత్త, నూతన ఆవిష్కర్త హంఫ్రీ డేవీ జననం. (మ.1829)
- **1866:** ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, కవి, రచయిత కూచి నరసింహం జననం. (మ.1940)
- **1903:** రైటు సోదరులు తయారుచేసిన విమానం మొద టిసారి ఎగిరింది.
- **1905:** న్యాయవాది, భారత ప్రధాన న్యాయమూర్తి, తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన మహమ్మద్ హిదయతుల్లా జననం. (మ.1992)
- **1959:** స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, డా.భోగరాజు పట్టాభి సీతారామయ్య మరణం. (జ.1880).
- **1959:** సినీనటి జయసుధ పుట్టినరోజు. (చిత్రంలో)
- **1996:** తెలుగు సినిమా నటి సూర్యకాంతం మరణం. (జ.1924)


హంఫ్రీ డేవీ


కూచి నరసింహం


మహమ్మద్ హిదయతుల్లా



సీతారామయ్య


జయసుధ


సూర్యకాంతం

రిపబ్లిక్ స్పోర్ట్స్

## బ్రిస్బేన్ టెస్టు.. రెండో ఇన్నింగ్స్ కోసం విరాట్ కఠోర సాధన!

ఈసారి బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భారత్ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి అనుకున్నంత మేర సక్సెస్ కాలేదు. పేలవ షాట్లతో పెవిలియన్కు చేరి అభిమానులను నిరాశకు గురి చేశాడు.



ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ వేదికగా భారత్ మూడో టెస్టు ఆడుతోంది.మొదటి ఇన్నింగ్స్ లో ఆసీస్ 445 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. టీమ్ ఇండియా ఆటగాళ్లు కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా హాఫ్ సెంచరీలు సాధించారు. అయితే యశస్వి జైస్వాల్ (4), శుభ్మన్ గిల్ (1), విరాట్ కోహ్లి (3), రిషబ్ పంత్ (9) సింగిల్ డిజిట్కే పరిమితం కావడం గమనార్హం. గబ్బా టెస్టులో ఓటమి నుంచి గట్టెక్కాలంటే రెండో ఇన్నింగ్స్ భారత్కు అత్యంత కీలకం. బౌలింగ్కు సహకరిస్తున్న పిచ్పై ఆసీస్ను ఎదుర్కోవాలంటే టీమిండియా బ్యాటర్లకు మరింత ఓర్పు అవసరం. అందుకోసం ఇప్పట్నుంచే విరాట్ కోహ్లి, శుభ్మన్ గిల్ సాధన మొదలుపెట్టారు. ఓవైపు భారత్ బ్యాటింగ్ కొనసాగుతూ ఉండగా.. ఇప్పటికే ఔటైన బ్యాటర్లు మాత్రం నెట్స్లో విపరీతంగా శ్రమించారు. ఈమేరకు భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ దీని గురించి విశ్లేషించాడు. పేసర్ ప్రసిద్ధి కృష్ణ బౌలింగ్ సాధన చేశారు.ఇదీ చదవండి: ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య మూడో టెస్టు లైవ్ అప్ డేట్స్ "నెట్స్లో స్టార్ క్రికెటర్లు ఉన్నారు. ఇప్పటికే చాలా బంతులు ఆడారు. ఇక్కడ ఎందుకు ఉన్నారనే ప్రశ్నలు రావడం సహజం. ఇప్పటివరకు ఈ సిరీస్లో శతకం మినహా.. ఎక్కువ పరుగులు చేయలేదు. విరాట్ కోహ్లి, గిల్ రాణించడం భారత్కు అత్యంత అవసరం. ఫామ్లో లేనప్పుడు ఎక్కువ బంతులను హిట్టింగ్ చేయడంపైనే సాధన చేయాలి" అని హర్భజన్ వెల్లడించాడు.

# 2024: హతవిధీ.. ఇవన్నీ 'పాన్ ఇండియా' కాలేకపోయాయి!

2024 చివరికి వచ్చింది. ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద ఎన్నో ఆసక్తికర చిత్రాలు అలరించాయి. పాన్ ఇండియా స్థాయిలోనూ పలు చిత్రాలు పలకరించాయి. మరి వాటి పరిస్థితి ఏమైంది? ఎంతవరకూ రాణించాయి?



'రారా అబ్బాయ్.. ఏంటి సంగతులు. చాలా రోజుల తర్వాత వచ్చావు'..'ఏం లేదు బాబాయ్.. ఇయర్ ఎండింగ్ కదా.. కాలేజ్లో 'పాన్ ఇండియా మూవీస్' టాపిక్ మాట్లాడమన్నారు. నువ్వేమో సినిమా అంటే పడిచస్తావు కదా. పైగా కొత్త సినిమా వస్తే, చూసే దాకా థియేటర్ చుట్టూ తిరుగుతూనే ఉంటావు. కాస్త ఆ వివరాలు చెబుతావని వచ్చాను"సర్లేరా.. అయినా మొన్న రానా ఎంత పెద్ద మాట అన్నాడురా..."ఇంతకీ ఏమన్నాడు బాబాయ్.."బాహుబలి సినిమా చేస్తున్నప్పుడు దాని విలువ తెలియలేదు సర్ (రాజమౌళి).. అయిపోయిన తర్వాత తెలుస్తోంది. గొప్ప ఆలోచనలు, గొప్ప పనులు చేశాం. ఇప్పుడు దాన్ని పాడు చేశారు..బయట అలా జరగడం లేదు' అన్నాడు.'అవునా బాబాయ్ అంత మాట అన్నాడా? "నిజమేరా అబ్బాయి.. 'బాహుబలి 1' విడుదలై వచ్చే ఏడాదికి పదేళ్లు పూర్తవుతుంది. ఏదైనా అదో ట్రెండ్ సెట్టర్. అదిగో అప్పటి నుంచి ఇండస్ట్రీకి పాన్ ఇండియా ఫిల్మ్ పిచ్చి పట్టుకుంది"ఇంతకీ దేనిని పాన్ ఇండియా మూవీ అంటారు బాబాయ్.."పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు' అన్నీ పాన్ ఇండియా మూవీలు కావురా అబ్బాయ్. ఆ అర్థాన్ని మార్చేశారు. దర్శకుడు, రచయిత ఏదో ఒక సబ్జెక్ట్ అనుకోవడం.. భారీ బడ్జెట్ పేరుతో దానికి అనవసరమైన హంగులు జోడించడం గత కొంతకాలంగా పరిపాటిగా మారిపోయింది. అంటే, తాము అనుకున్న కథకు పాత్రకు వేరే భాషల నటుల అవసరం లేకపోయినా, పాన్ ఇండియా మోజులో ఒక్కో కీలక పాత్రకు ఒక్కో భాషా నటుడిని ఎంపిక చేసి, సినిమా వీర లెవల్లో పైకి లేపుతున్నారు. తీరా బాక్సాఫీస్ వద్ద అవి బోల్తా పడిపోతున్నాయి"భారీ బడ్జెట్, వివిధ ఇండస్ట్రీల్లోని కీలక నటులు నటిస్తే సరిపోతుందా? సబ్జెక్ట్ ఉండక్కర్లేదా? దీన్నే సబ్జెక్ట్ (కథ) లేక ఆబ్జెక్ట్ (నటీనటులు) మీద ఆధారపడటం అంటారు. ఒకప్పుడు హాలీవుడ్ సినిమాలు ఇక్కడి ప్రేక్షకులను అలరించేవి. అలాగని, అన్నీ సినిమాలు వచ్చేసేవి కావు కదా! ప్రతి ప్రేక్షకుడికి ఆ మూవీలోని కథ కనెక్ట్ కావాలి. అలా అన్నాను కదాని, అన్నింటినీ ఒకే గాటన కట్టొద్దు. 'కాంతార' లాంటివి కొన్ని వినూత్నమైన సబ్జెక్టు హిట్ అయిపోతుంటాయి"పాన్ ఇండియా' ట్యాగ్ తో వచ్చిన చాలా చిత్రాలు ఈ ఏడాది అంతగా ప్రేక్షకులకు రుచించలేదు. పైగా అవన్నీ థియేటర్కు తక్కువ.. ఓటీటీకి ఎక్కువ స్థాయి కథలతో రావడమూ ఓ కారణమే. ముఖ్యంగా బాలీవుడ్ లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్షయ్, టైగర్ ష్రాఫ్ 'బడే మియా చోటేమియా', అజయ్ దేవ్గణ్ 'మైదాన్', అలియా భట్ 'జిగ్రా', సిద్ధార్థ్ మల్హోత్ర 'యోధ', విద్యుత్ జమ్వాల్ 'క్రాక్' పేరుకు కొన్ని చిత్రాలు. ఎన్నో అంచనాలతో విడుదలై ప్రేక్షకులను ఏ మాత్రం మెప్పించలేకపోయాయి. 'సింగమ్ అగైన్' అంటూ రోహిత్ శెట్టి పెద్ద కంగాళీ చేశాడు"ఇందుకు దక్షిణాది చిత్రాలు ఇందుకు మినహాయింపు ఏమీ కాదురా అబ్బాయి. మోహన్లాల్ 'మలైకోట్టై వాలిబన్'ను కేరళ ప్రేక్షకులే పెద్దగా చూడలేదు. ఇక ఎన్నో అంచనాల మధ్య వచ్చిన 'ఇండియన్ 2' గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'తాత వచ్చాడే.. ప్రేక్షకులను ఇరగదీసి పోయాడే' అని ఫ్యాన్సే బాధపడ్డారు. తాత మర్మకళ వికటించడంతో 'ఇండియన్3' ఎలాగో ముగించి ఓటీటీలో విడుదల చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. కథను జీళ్లపాకంలా సాగదీయడమే. 'ఇండియన్ 2' రెండు భాగాలుగా చెప్పాలనుకోవడమే పెద్ద మిస్టేక్ అని సినీ విశ్లేషకులు అంటున్నారు. అన్ని హిట్లు తీసిన శంకరుడికే తాత దెబ్బ గట్టిగా తగిలింది. ఇక విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్), రజనీకాంత్ 'వేట్టయన్'దీ అదే పరిస్థితి. సూర్య 'కంగువా' అయితే, ప్రేక్షకుడిని కంగుతినిపించింది. 'దేవర 1'ను ఎన్టీఆర్ ఓ సొరలాగా, పెద్ద పెట్టె లాగా తన భుజాలపై లాక్కొచ్చాడు కాబట్టి సరిపోయింది. 'ఈగల్', 'ఆపరేషన్ వాలెంటైన్', 'డబుల్ ఇస్మార్ట్', ' 'మట్కా'ల గురించి నేను మాట్లాడను" ఇది రా అబ్బాయి పడిపోయిన పాన్ ఇండియా సినిమాల పరిస్థితి.'అన్నీ బాగానే ఉన్నాయి కానీ, ఏదో ఒక్కటి తక్కువైంది బాబాయ్.."'ఏరా నీకు కాలేజ్కు టైమ్ అవ్వలేదా.. ఇంక బయలుదేరు..'

రిపబ్లిక్ సినిమా CINEMA

## నితిన్ 'రాబిన్ హుడ్' వాయిదా .. నిర్మాణ సంస్థ పోస్ట్

నితిన్ హీరోగా రానున్న చిత్రం 'రాబిన్ హుడ్'.. ఈ సినిమా వాయిదా పడినట్లు నిర్మాణసంస్థ తెలిపింది.




నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సిఉంది. తాజాగా దీన్ని వాయిదా వేస్తున్నట్లు నిర్మాణసంస్థ ప్రకటించింది. అనుకోని పరిస్థితుల వల్ల దీన్ని వాయిదా వేయాల్సి వచ్చిందంటూ మైత్రీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నితిన్ వెంకీ కుడుముల కాంబోలో రానున్న రెండో చిత్రమిది. శ్రీలీల కథానాయిక. - ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల చిత్రబృందం నిర్వహించిన ప్రెస్మీట్లోనూ షూటింగ్ అప్డేట్ పంచుకుంది. షూటింగ్ దాదాపు పూర్తయిందని ఒక్క పాట మాత్రమే మిగిలిఉందన్నారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా సినిమా విడుదల ఆలస్యమైనట్లు తెలుస్తోంది. నితిన్ కెరీర్లో అత్యంత భారీ బడ్జెట్ మూవీగా ఇది రానుంది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి. శ్రీలీలతో కలిసి రెండోసారి నటించడం ఆనందంగా ఉందని.. ఈ సినిమా తర్వాత మాది హిట్ జోడీ అవుతుందని నితిన్ తెలిపారు.

## ఆరోగ్యం




బార్లీ.. వీటిలోని పోషకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుంటారు. ఇందులో ఎక్కువగా డైటరీ ఫైబర్ అంటే బీటా గ్లూకాన్ ఉంటుంది. గోధుమలు, బియ్యంలో కంటే ఎక్కువ పోషకాలు ఇందులోనే ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల డయాబెటిస్, గుండె సమస్యలు, హైబీపి ఉన్నవారికి చాలా మంచిది. వీటి గొప్ప గుణాలు తెలుసు కాబట్టే సంవత్సరాల నుంచి దీనిని వారు తమ డైట్లో యాడ్ చేసుకున్నారు.బార్లీ నీటిలో విటమిన్స్, మినరల్స్, ఫొలేట్, ఐరన్, కాపర్, మంగనీస్ ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని నేరుగా తాగడం ఇష్టం లేకపోతే ఇందులో నిమ్మరసం, తేనె కలిపి తీసుకోవచ్చు. ఈ నీటిని తీసుకోవడం వల్ల ఎలాంటి లాభాలున్నాయో తెలుసుకోండి.

### డీటాక్స్..




బార్లీ నీటిని తీసుకోవడం వల్ల డీటాక్సిఫికేషన్ జరుగుతుంది. దీని వల్ల ఓవరాల్ ఇమ్యూన్ సిస్టమ్ మెరుగ్గా మారుతుంది. ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. బాడీలోని వ్యాధికారక క్రిములన్నీ బయటికి వెళ్లిపోతాయి.

## చలికాలంలో వేడివేడి చాయ్, కాఫీలు తాగే బదులు బార్లీనీరు తాగితే ఈ 6 సమస్యలు దూరం

### జీర్ణ సమస్యలు..




బార్లీ నీటిలో ఫైబర్ ఉంటుంది. దీని వల్ల జీర్ణ సమస్యలు దూరమవ్వడమే కాకుండా బౌల్ మూమెంట్స్ బాగుంటాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల గట్ హెల్దీ బ్యాక్టీరియాని పెంచుతుంది. దీంతో జీర్ణ సమస్యలు దూరమవ్వడమే కాకుండా మెటబాలిజం పెరుగుతుంది.

### బ్లడ్ షుగర్.



బార్లీ వాటర్ని తీసుకుంటే గుడ్ బ్యాక్టీరియాని పెంచి బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గిస్తాయి. దీని వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ సరిగ్గా ఉంటాయి. అన్స్వీటెన్డ్ అయిన ఈ నీటిని తీసుకోవడం వల్ల ఒకేసారి బ్లడ్ షుగర్ లెవల్స్ పెరుగవు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ షుగర్ ఉన్నవారికి సమస్యలు లేకుండా చేస్తాయి.

### గుండె ఆరోగ్యానికి..




బార్లీ నీటిలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన బాడీలో కొలెస్ట్రాల్ని కరిగిస్తాయి. దీంతో పాటు ఆర్టరీ బ్లాకేజ్ని క్లియర్ చేస్తాయి. రెగ్యులర్గా తాగితే గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. అదే విధంగా, కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ఈ బార్లీ నీటిని తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. దీంతో బ్లాకేజీని క్లియర్ చేసి రక్త సరఫరాని మెరుగ్గా చేస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్రీ రాడికల్స్ని తగ్గించి ఆక్సిడేటివ్ స్ట్రెస్ని తగ్గిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

### కిడ్నీల ఆరోగ్యానికి..



బార్లీ నీటిని తీసుకోవడం వల్ల పీహెచ్ లెవల్ సరిగా ఉంటుంది. దీని వల్ల కిడ్నీ సమస్యలు ముఖ్యంగా కిడ్నీ సమస్యలు రావు. ఈ నీటిని తీసుకోవడం వల్ల కిడ్నీలు క్లీన్ అవుతాయి. యూరిన్లో కాల్షియం శాతాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా, ఈ నీటిని తీసుకుంటే కిడ్నీల పనితీరు మెరుగ్గా మారుతుంది. యూటిఐ వంటి సమస్యలు రావు. ఈ బార్లీని తీసుకోవడం వల్ల ట్రైగ్లిజరైడ్స్ తగ్గుతాయి. లో డెన్సిటీ లిపోప్రోటీన్ ఇంప్రూవుతుంది. ఈ నీటిని తీసుకోవడం వల్ల బాడీ హైడ్రేట్గా ఉంటుంది. ఈ నీరు బ్లడ్ ప్యూరిఫైయర్గా పనిచేస్తుంది. అంతేకాకుండా, లివర్ని డీటాక్స్ చేసే బేవరేజ్గా పనిచేస్తుంది. ఈ బార్లీ నీటిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్ నుంచి బాడీని కాపాడతాయి. దీంతో మనకి ఎక్కువగా ఆరోగ్య సమస్యలు రావు.

### ప్రెగ్నెన్సీ..



కొన్ని డ్రింక్స్ ప్రెగ్నెంట్స్ తీసుకోవద్దు. కానీ, ఈ నీటిని ప్రెగ్నెంట్స్ హ్యాపీగా తీసుకోవచ్చు. దీంతో మార్నింగ్ సిక్నెస్, మలబద్ధకం, జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ఈ నీటిని తాగడం వల్ల ఉమ్మ నీరు కూడా పెరుగుతుంది. అయితే, ఈ నీటిని తాగే ముందు డాక్టర్ని కన్సల్ట్ అవ్వడం మంచిది.

### ఎలా చేయాలి..



ముప్పావు కప్పు బార్లీ గింజలు 2 నిమ్మకాయలుఅరకప్పు తేనె6 కప్పుల నీరు తయారీ విధానం..ముందుగా బార్లీని శుభ్రంగా కడగాలి. ఇప్పుడు ఓ గిన్నె తీసుకుని అందులో బార్లీ వేసి నిమ్మ చెక్కలు ఓ రకంగా చెప్పాలంటే రసం పిండి ఆ తొక్కలు తీసుకుండి. అందులోనే 6 కప్పుల నీరు వేయండి. మీడియం మంటపై వేడి చేయండి. వేడి అయిన తర్వాత 15 నుంచి 30 నిమిషాల వరకూ సిమ్లో పెట్టి మరిగించండి. ఇప్పుడు ఆ నీటిని మరిగించండి. గోరువెచ్చగా అయ్యా అందులో కొద్దిగా తేనె వేసి కలిపి తాగండి. ఇవేం ఇష్టం లేని వారు కేవలం బార్లీని శుభ్రంగా కడిగి 6 కప్పుల నీరు వేసి మరిగించి ఆ నీటిని తాగొచ్చు.

గమనిక:ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.